క్లుప్తంగా

వాసవీ మాతకు ఆషాఢ సారె



అంబాజీపేటలో వాసవీ మాతకు సారె సమర్పిస్తున్న మహిళలు

అంబాజీపేట: ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అంబాజీపేటలో వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢ సారె సమర్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. కాసు కుమారి, కాసు సంతోషి, కాసు రాధ, చెక్కా శిరీషా, మద్దుల లక్ష్మి, పాబోలు చిన్ని, బలభద్రపు అనిత, కాజా లీల, కోట్ల లక్ష్మిల ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. 21 రకాల పండ్లు, స్వీట్లు, పూలు, వస్త్రాలతో అమ్మవారికి సారె సమర్పించామన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో లలితా సహస్ర పారాయణ చేశారు. అనంతరం మహిళలకు అమ్మవారి సమర్పించిన సారెను పంపిణీ చేశారు.

బీజామృతంతో తెగుళ్ల నివారణ

అంబాజీపేట: బీజామృతంతో శుద్ధిచేసిన విత్తనాలతో నాటడం వల్ల వాటి నుంచి సంక్రమించే తెగుళ్లను నివారించి, అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ జనిపల్లి నాగవేణి అన్నారు. వక్కలంకలో బీజామృతంతో విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నాగవేణి మాట్లాడుతూ బీజామృతంతో శుద్ధి చేసిన విత్తనాలు మొలక శాతం అధికంగా ఉంటుందన్నారు. బీజామృతం తయారీ, విత్తన శుద్ధి తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీజీ పల్లయ్య, రైతులు వక్కపట్ల సూరిబాబు, గొల్లపల్లి సత్యనారాయణ, బట్టు ఆంజనేయులు, మర్రి లాజరు, జనపల్లి గణేష్ పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఉచిత పంట బీమా రూ.2.75 కోట్ల పంపిణీ

అంబాజీపేట: వాతావరణ ఆధారిత పంటలకు సంబంధించి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి ఉచిత పంటల బీమా రూ.2,75,99,559 అరటి రైతులకు పంపిణీ చేసినట్లు పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు తెలిపారు. నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల వద్ద రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన ఉచిత పంటల బీమా కార్యక్రమాన్ని శనివారం టెలివిజన్ ద్వారా వీక్షించారు. ఆయన మాట్లాడుతూ పి.గన్నవరంలో 1057 మందికి గాను రూ.27,90,088. అంబాజీపేటలో 1358 మందికి రూ.94,97,926, మామిడికుదురులో 20 మందికి రూ.1,23,949, అయినవిల్లిలో 3906 మంది రైతులకు రూ.1,51,87,596 మంజూరయ్యాయన్నారు. ఆయా బ్యాంకు ఖాతాలో వారిపేరున జమ అవుతాయన్నారు. ఏడీఏ వెంట ఏఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన వేల్పూరి వెర్రియ్య (70) పురుగు మందు తాగి మృతి చెందినట్లు వెర్రియ్య కుమారుడు రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్ తెలిపారు. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రూ.6.20 లక్షల భారీ చోరీ

ఆత్రేయపురం: మండలంలోని కట్టుంగ గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఎస్సై బీవై కిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పచ్చగోళ్ల శ్రీనివాసరావు రెండు రోజులు క్రితం క్యాన్సర్ వ్యాధి చికిత్సకు రాజమహేంద్రవరం జీఎస్‌ఎల్ ఆస్పత్రికి వెళ్లారు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరచి ఉండటంతో కంగారు పడి లోపలికి వెళ్లి చూసేసరికి చోరీ జరిగినట్టు గుర్తించారు. ఇంట్లో రూ.లక్ష నగదు, 25 కాసుల బంగారం, కేజీన్నర వెండి పళ్లాలు, గ్లాసులు చోరీ అయినట్టు గుర్తించారు. మొత్తం రూ.6.20 లక్షల సొత్తు చోరీ అయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కిరణ్ తెలిపారు.

స్వామి వారి సన్నిధిలో పంచాయతీరాజ్ సీఈ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజినీర్ సి.అమరనాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆయనకు అందజేశారు.



నగరంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



విశ్వేశ్వరాయపురంలో వృద్ధులకు పండ్లు, పాలు, నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

చిరస్మరణీయుడు వైఎస్సార్

- వాడవాడలా రాజశేఖరరెడ్డి జయంతి
- నివాళులర్పించిన నేతలు
- వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ

మామిడికుదురు: దివంగత సీఎం వైఎస్సార్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు, విగ్రహాలకు పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, బొలిశెట్టి భగవాన్, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం సెంటర్‌లో దివంగతం సీఎం వైఎస్సార్ జయంతిని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ముక్తేశ్వరం సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఆయన స్థానికంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి వైఎస్సార్ జయంతి జరిపారు. అనంతరం విలస లెప్రసీ ఆస్పత్రిలో రోగులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, పార్టీ నాయకులు కొండేటి వికాస్‌బాబు, మట్టపర్తి వెంకటరమణ, గుత్తుల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: ఏ కష్టం వచ్చినా నిరుపేదలకు ముందుగా గుర్తొచ్చేది దివంగత వైఎస్సారేనని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేటలో పార్టీ మండల కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాచవరంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పీకే రావు సమకూర్చిన దుప్పట్లు, చీరలను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం స్త్రీల ఆస్పత్రి రోగులకు పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి నిర్వహించారు.



పి.గన్నవరంలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వృద్ధులకు, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



నర్శిపూడిలో మహిళలకు చీరలు పంచుతున్న వైఎస్సార్ సీపీ నేతలు



రావులపాలెం వైఎస్సార్ జంక్షన్ వద్ద వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పి.గన్నవరం అక్విడెక్ట్ పార్కులో ఆయన విగ్రహానికి చిట్టిబాబు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఆయన బర్త్ డే కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కొండేటి ఫౌండేషన్ ప్రతినిధులు కొండేటి వెంకటేశ్వరరావు, వికాస్‌బాబుల ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు ఎమ్మెల్యే చిట్టిబాబు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు వాడ్రేవుపల్లి, నాగుల్లంక గ్రామాల్లో రాజశేఖరరెడ్డి విగ్రహాలకు చిట్టిబాబు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ మార్గం అందరికీ ఆదర్శం

మలికిపురం: మాజీ సీఎం వైఎస్సార్ అనుసరించిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. రాజశేఖరరెడ్డి జయంతిని మలికిపురంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంచారు. రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. విశ్వేశ్వరాయపురంలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్, పాలు, నిత్యావసరాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్నరాజా, పార్టీ నాయకులు మంగెన సింహాద్రి, కేఎస్‌ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: దేశ చరిత్రలోనే వైఎస్సార్ 'జన హృదయ నేత'గా నిలిచారని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు ఆధ్వర్యంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు తదితర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పర్సన్ డీఎస్, సర్పంచ్‌లు రెడ్డి చంటి, మండల సేవాదళ్ అధ్యక్షుడు జీపీ, ఎంపీటీసీ పేపకాయల బ్రహ్మానందం, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో పార్టీ నాయకులు వైఎస్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజోలులో..

రాజోలు: స్థానిక మార్కెట్ సెంటర్లో దివంగత సీఎం వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతులు పాలిట రైతు బాంధవుడు అని ఎమ్మెల్యే కొనియాడారు. సర్పంచ్ రేవు జ్యోతి, జెడ్పీటీసీ మట్టా శైలజ, పార్టీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మట్టా ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తాటిపాక సెంటర్లో వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి కేక్ కట్ చేశారు. గుబ్బల మనోహర్, క్రిస్టియన్ సెల్ ప్రతినిధులు కనపాల బాబూరావు, బొంతు రమేష్ పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆరాధ్యదైవం, ఆరోగ్య, విద్య ప్రదాత వైఎస్సార్ జయంతి పురస్కరించుకుని ఉయ్యూరు వారి మెరక నాలుగు రోడ్ల కూడలిలో ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కార్యకర్తలతో కలిసి గ్రామ శాఖ అధ్యక్షుడు కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు కట్ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. నాయకులు ఉప్పు సోమరాజు, ఇంజేటి విజయ్ కుమార్, చింతా సుధాకర్‌రావు, రొక్కాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మోరి వెటర్నరీ ఆస్పత్రి ప్రాంగణంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మహానేత వైఎస్సార్ జయంతిని పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, అభిమానులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వైఎస్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని పేరవరంలో పార్టీ నేత రాయి వెంకటేశ్వరరావు వైఎస్సార్ సీపీ శ్రేణులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే పలు గ్రామాల్లో పార్టీ నేతల ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వాడవాడలా రాజన్నకు ఘన నివాళులు

రావులపాలెం: వైఎస్సార్ జయంతి సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో నాయకులు, అభిమానులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సిబ్బంది తదితరులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే స్థానిక హైవే జంక్షన్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద మహానేత విగ్రహానికి జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి తదితరులు నివాళులర్పించి వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: వైఎస్సార్ జయంతిని మండలంలో పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఆలమూరు బస్టాండు సెంటర్‌లో రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు రావాడ సత్తిబాబు, తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే పలు గ్రామాల్లో పార్టీ నాయకుల ఆధ్వర్యాన వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్శిపూడిలో పార్టీ నేత చల్లా వెంకటసుబ్రహ్మణ్యం నేతృత్వంలో మహిళలకు చీరలు పంచారు.

రోగులకు సంతృప్తికరంగా వైద్య సేవలు



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీరాణి

కొత్తపేట: వివిధ అనారోగ్య లక్షణాలతో ఆస్పత్రికి వచ్చిన ప్రతి రోగి సంతృప్తిగా తిరిగి వెళ్లేలా వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించాలని వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ ఎన్‌పీపీ పద్మశ్రీరాణి సూచించారు. ఆమె శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలో వివిధ విభాగాలు, వైద్యులు, సిబ్బంది పనితీరు పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య సేవల రిజిస్టర్లు, ఓపీ, ఇన్ పేషెంట్ల సంఖ్య పరిశీలించారు. స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో వైద్య సేవలకు సంబంధించి వైద్యుల నియామకంతో పాటు అవసరం మేరకు ఇతర ఆస్పత్రుల నుంచి డిప్యుటేషన్‌పై కూడా తీసుకువచ్చి సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఆస్పత్రి పనితీరును స్థానికులతో పాటు డీసీహెచ్‌ఎస్ పద్మశ్రీ ప్రశంసించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందించాలని సంగీత శ్రీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు విప్రసాదం అన్నారు. రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సహకారంతో సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, చింతపల్లి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఆలమూరు, సూర్యారావుపేట గ్రామాల్లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని వారు సూచించారు. ఈ సందర్భంగా 100 రకాల వివిధ జాతి మొక్కలను స్థానిక పంచాయతీ, పాఠశాల, ఖాళీ ప్రదేశాల్లో నాటారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.సంజీవరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో నిర్వహించిన సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండో శనివారం సెలవు కావడంతో పిల్లా పాపలతో స్వామి దర్శనానికి వచ్చారు. ఆలయంలో స్వామివారి నారసింహ సుదర్శన హోమంలో భక్తులు పాల్గొన్నారు. సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా మూడు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే వారంతా అన్నదానంలో స్వామి అన్న ప్రసాదాన్ని తీసుకున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పలువురికి చేయూత

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన గుబ్బల శ్రీను కుటుంబానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, సూరపురెడ్డి సురేష్, జనసేన పార్టీ నాయకులు దంగేటి శ్రీహరి నిత్యావసరాలను అందించారు. అదే గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ అసిస్టెంట్ రాయి ధనరాజు విద్యుత్ స్తంభం పై నుంచి పడి గాయపడ్డాడు. ధనరాజుకు ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి గ్రామం కనకదుర్గమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు గనిశెట్టి రామలింగేశ్వరరావు రూ.2000 అందజేశారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మోదీ పాలన

కొత్తపేట: దేశంలో ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం అన్నారు. మోదీ 9 ఏళ్ల పాలన, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ బీజేపీ నాయకులు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికంగా పలు బూత్‌లతో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యానందం, రాష్ట్ర టీచర్స్ సెల్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం



చిన్నారికి సాయం అందిస్తున్న బుజ్జిరాజు

రాజోలు: స్థానిక గాంధీనగర్‌కు చెందిన చిన్నారి పలివెల బ్లెస్సీకి హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వసుధ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం శనివారం పంపిణీ చేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని ఫౌండేషన్ నియోజకవర్గ కన్వీనర్ జంపన బుజ్జిరాజు చిన్నారికి అందజేశారు. బ్లెస్సీకి ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ జరగడంతో చికిత్సకు ఈ మొత్తాన్ని ఇచ్చారు. ఎమ్మార్పీఎస్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్, బోణం రాజు, అటారం మాస్టారు, స్టార్ శ్రీను పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



టెన్త్ టాపర్స్‌కు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తున్న డీసీపీ మోకా సత్తిబాబు, రమాదేవి దంపతులు

పి.గన్నవరం: విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. కోనసీమలోని 8 మండలాలకు చెందిన 40 మంది టెన్త్ టాపర్లకు శ్రీచారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ మోకా రమాదేవి ఆధ్వర్యంలో శనివారం పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో ప్రతిభా పురస్కారాల అభినందన సభ నిర్వహించారు. విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు, రమాదేవి దంపతులు టెన్త్ టాపర్లకు నగదు బహుమతి, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వారు అభినందించారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.శ్రీచరణ్, ప్రిన్సిపాల్ పీవీఆర్ నాయుడు, గోసంగి బంగార్రాజు, గెడ్డం ప్రదీప్, ఎస్.వెంకటేశ్వరరావు, పరమట నాని, బయ్యా మోహన్, అజయ్ భూషణ్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండండి



పాశర్లపూడిలంకలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న భారతలక్ష్మి

మామిడికుదురు: డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారిణి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ సీహెచ్‌వీ భారతలక్ష్మి సూచించారు. ఆమె శనివారం లూటుకుర్రు పీహెచ్‌సీని సందర్శించారు. డ్రైడే–ఫ్రైడే కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించి దానిపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కుష్ఠు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. కుష్ఠు వ్యాధి అనుమానితుల నుంచి శాంపిల్స్ సేకరించి పంపించాలన్నారు. వర్షాకాలం కావడంతో డెంగీ వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందని, దీనిపై ప్రజలకు చైతన్యం కలిగించాలని సూచించారు. కార్యక్రమాల్లో డాక్టర్లు ఎం.స్పందన, డీవీ సత్యం, ఎస్‌టీఎల్‌ఎస్ రాఘవేంద్ర, ఎస్‌యూఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

అరుణాచలం తీర్థయాత్ర



కొత్తపేట: శ్రావణ పూర్ణిమ సందర్భంగా ఏపీఎస్‌ఆర్‌టీసీ రావులపాలెం డిపో నుంచి అరుణాచలం యాత్ర ప్రత్యేక స్పెషల్ బస్ సర్వీసు నడుపుతున్నట్టు ఆ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. శనివారం కొత్తపేటలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ విశిష్టత, భక్తుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని అక్కడికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్ సర్వీసు నడుపుతున్నట్టు తెలిపారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 2 వరకూ 4 రోజుల యాత్రలో తిరుత్తణి, కాంచీపురం, అరుణాచలం, శ్రీపురం, శ్రీకాళహస్తి, విజయవాడ క్షేత్రాలను దర్శనం చేయిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక యాత్రకు సంబంధించి సూపర్ లగ్జరీ బస్ సర్వీసు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. టిక్కెట్ ధర రూ.3,000 అని పేర్కొన్నారు. అరుణాచలం యాత్రకు వెళ్లే భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. టిక్కెట్లు, ఇతర వివరాలకు అసిస్టెంట్ మేనేజర్, సెల్ 7382911871కు ఫోన్ చేసి సంప్రదించాలని పేర్కొన్నారు.